క్లుప్తంగా

ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్ సంస్థ ద్వారా టీటీడీ ప్రజా సంబంధాల విభాగంలో పొరుగు సేవల ప్రాతిపదికన పబ్లిసిటీ అసిస్టెంట్ పోస్టు నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కార్పొరేషన్ సీఈఓ షణ్ముఖ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 13వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్, అలిపిరి, తిరుపతి, కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు, చిరునామా, ఉద్యోగ, అర్హత, జీత భత్యాలు ఇతర వివరాల కోసం కార్పొరేషన్ వెబ్ సైట్ http://rrmpc.in/ ను వీక్షించగలరని తెలిపారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే విద్య

పాకాల: మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నారు. శనివారం ఎక్కువ శాతం అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఇంటి వద్ద నిర్వహిస్తున్న విద్యను తిరుపతి సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. తలారిపల్లి, పకీరుపేట, పాకాల, దామలచెరువు, దేశిరెడ్డిపల్లి, ఉప్పువంక గ్రామాల్లోని దివ్యాంగులకు అందిస్తున్న విద్యపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న రవాణా భత్యం, రీడర్ అలవెన్స్, ఇంటి వద్దనే విద్య భత్యం, సహాయకుల భత్యం సరిగ్గా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రత్యేక అవసరాల గల పిల్లలు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారస్తుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ టీటీడీ పరిపాలన భవనం ఎదుట శనివారం 11వ రోజు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ పోరాటాలు చేస్తున్నా టీటీడీ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మల్లి, సోను, మొగిలప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ప్రతాప్ స్వామీజీ

తిరుపతి రూరల్: పేరూరు బండపై కొలువైన వకుళామాత అమ్మవారికి ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామీజీ, బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ భక్తులతో కలిసి శనివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. నరేష్ నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండే చెంగారెడ్డి, వాసు, మురళి, ఫణిభూషణ రెడ్డి, కల్యాణి, వసంత, జయలక్ష్మి భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,080 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,394 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

సంక్షోభంలో ఎన్డీఏ ప్రభుత్వం



తిరుపతి కల్చరల్: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం సంక్షోభంలో పడిందని, దేశంలో నరేంద్రమోదీ గ్రాఫ్ రోజురోజుకూ తగ్గుతోందని, మోదీని మార్చాలని బీజేపీ నేతలే అంటున్నారని, ఆర్ఎస్ఎస్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. శనివారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో బీజేపీకి 60 సీట్లుకు పైగా తగ్గాయని, మోదీ గ్రాఫ్ తగ్గుతోందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. మోదీ నియంతృత్వ పోకడలతో జనం విసిగిపోయారని, బంగ్లాదేశ్ పరిస్థితులు ఇండియాలో కూడా వచ్చే పరిస్థితి ఉందన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న మోదీకి చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు

తిరుపతి కల్చరల్: చంద్రగిరి మండలం కోటలోపల తన స్థలంలో హోటల్ కన్స్ట్రక్షన్ కోసం ఎమ్మెల్యే నానికి రూ.50 లక్షలు, సుబ్రమణ్యం నాయుడుకు రూ.20 లక్షలు ఇచ్చానని వస్తున్న ఆరోపణలు అవాస్తమని రైతు సింగంశెట్టి రాము తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



అలిపిరి.. జనమేగిరి

కలియుగ దైవం తిరుమల శ్రీనివాసుడి దర్శనభాగ్యం కోసం శనివారం అలిపిరి పాదాల మండపం వద్ద భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాలినడక భక్తులు అలిపిరి వద్ద దీపారాధన చేసి కొబ్బరికాయలు కొట్టి నడక ప్రారంభించారు. దీంతో అలిపిరి పాదాల మండపం వద్ద సందడి నెలకొంది. భక్తుల గోవిందనామ స్మరణలతో అలిపిరి మార్మోగింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

దోమల నివారణకు డ్రోన్లతో పిచికారీ

- కమిషనర్ మౌర్య



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో దోమల వృద్ధిని నియంత్రించడానికి, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో పిచికారీ చేసేందుకు చర్యలు చేపట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ వద్ద శనివారం డ్రోన్లతో మందును పిచికారీ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు అధికారులు గుర్తించిన 32 ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ ఉన్నారు.

మరింత పటిష్టంగా స్వచ్ఛ సర్వేక్షణ్..

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను మరింత పటిష్టంగా నిర్వహించి ఆధ్యాత్మిక తిరుపతి నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.

సమన్వయంతో చవితి ఉత్సవాలు

వినాయక చవితి మహోత్సవాలు వినాయక ప్రతిమ నిమజ్జన వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటులు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య అన్నారు. తుడా కార్యాలయంలో శనివారం శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

పౌరహక్కులపై అవగాహన

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని ఒడ్డుకాల్వ గ్రామంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ దళితులను ఎవరైనా కులం పేరుతో దూషించినా, అంటరానివారుగా అవమానిస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భాకరాపేట: దళితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చిన్నగొట్టిగల్లు గ్రామ రెవెన్యూ అధికారి మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. సివిల్ రైట్స్ డేని పురస్కరించుకుని శనివారం చిగరాలచెరువు దళితవాడలో సమావేశం నిర్వహించారు. సమావేశం దృష్టికి 13 వినతులు వచ్చాయి.

తిరుచ్చిపై శ్రీనివాసుడు చిద్విలాసం



భక్తులను కటాక్షిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుమూర్తికి ఘనసన్మానం



గురుమూర్తి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి సిటీ: స్థానిక టీటీడీ శ్రీనివాసం వసతి సముదాయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేస్తూ శనివారం పదవీ విరమణ పొందిన పార్లపల్లి గురుమూర్తిని ఉద్యోగులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసం స్పెషల్ డీఈఓ పార్వతమ్మ, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ యాదవతి ఆయన సేవలను కొనియాడారు. శేషజీవితం సుఖసంతోషాలతో గడవాలని ఉద్యోగులు, బంధుమిత్రులు ఆశీర్వదించారు.

ముగిసిన సామాజిక శాస్త్ర సమావేశాలు



సమావేశమైన వైద్యులు, విద్యార్థులు

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సామాజిక శాస్త్ర సంఘ సంయుక్త సమావేశాలు శనివారంతో ముగుస్తాయి. వైద్యరంగంలో భవిష్యత్తులో సాంకేతిక వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ పాల్గొని మాట్లాడారు. సామాజిక ఆరోగ్య విషయాలలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సునీత, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రీజనల్ డైరెక్టర్ అనురాధ, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవిప్రభు, మెటర్నటీ సూపరింటెండెంటు డాక్టర్ పార్థసారథి రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ ఎస్ఐగా ఎస్‌కే మూర్తి



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ ఎస్ఐగా ఎస్‌కే మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగేంద్రబాబు ఇటీవల బదిలీల్లో భాగంగా తిరుపతి ఈస్ట్ స్టేషన్‌కు వెళ్లారు.

ఓఆర్ఐ నూతన వెబ్‌సైట్ ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఓఆర్ఐ) కోసం వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు శనివారం నూతన వెబ్‌సైట్‌ను తన చాంబర్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓఆర్ఐ అనేది అమూల్యమైన తాళపత్రాలు, గత తరాల జ్ఞానాన్ని భద్రపరిచే రచనల నిధి అన్నారు. నూతన వెబ్‌సైట్ ప్రపంచంలోని పండితులకు, పరిశోధకులకు, ఔత్సాహికులకు విస్తారమైన జ్ఞానాన్ని అందిస్తుందన్నారు. భారతీయ జ్ఞానసంపదను ప్రపంచానికి అందించడమే ఈ వెబ్‌సైట్ లక్ష్యమన్నారు. రాత పత్రాలను సేకరించడం, డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే నూతన వెబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మరిన్ని విషయాలపై అవగాహన పెంచుకునేందుకు WWW. SVUORI. COM వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు పీసీ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఫణిరమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏదీ 'పింఛన్'

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ పంచాయతీలో సామాజిక పింఛన్లను పొందడంలో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామంలో పింఛన్లను పంపిణీ చేయడానికి సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. పంచాయతీ కార్యాలయానికే వృద్ధులు, దివ్యాంగులను రావాలని చెప్పడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో ఓ వృద్ధురాలు కాలుజారి పడిపోయింది.

తుపానులోనూ నిరంతర సరఫరా

– ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు



సంతోషరావు, సీఎండీ

తిరుపతి రూరల్: తుపాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ పనులను నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలియజేశారు. సంస్థ పరిధిలోని అనంతపురం సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్(ట్రైనింగ్స్) వరకుమార్, నెల్లూరు సర్కిల్‌కు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు జనరల్ మేనేజర్ రామచంద్రరావు, కడప సర్కిల్‌కు జనరల్ మేనేజర్ మురళి, కర్నూల్ సర్కిల్‌కు జనరల్ మేనేజర్ ఇస్మాయిల్ అహమ్మద్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు 91333 31912తో చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆక్రమిత భూమి స్వాధీనం



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్ : నగరంలోని పల్లెవీధిలో ఉన్న వేశాలమ్మ ఆలయానికి చెందిన భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ ఈఓ కె.మమత తెలిపారు. సదరు భూమిని కొన్నేళ్ల క్రితం కె.చెంగల్‌రాయల్ కుమారుడు సి.జై నారాయణ్ ఆక్రమించి అందులో పూరిగుడిసె వేసుకొని జీవిస్తున్నాడని వెల్లడించారు. దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు శనివారం మధ్యాహ్నం జిల్లా దేవదాయ శాఖ అధికారి పి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ్, ఇతర శాఖాధికారుల ద్వారా పంచనామా నిర్వహించి స్థలం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చిప్ టెక్నాలజీపై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో శనివారం చిప్ టెక్నాలజీ, డిజైన్, ఐటీటీ అప్లికేషన్స్‌పై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన నానో చిప్ సొల్యూషన్స్ సీఈఓ డాక్టర్ హరికృష్ణన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అకడమిక్ విద్య కంటే ఆయా రంగాలపై పట్టుకలిగి, ప్రతిభ, నైపుణ్యం ఉన్నవారికే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, పలు సంస్థల నుంచి విచ్చేసిన డైరెక్టర్లు, ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన




ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న తమిళనాడు ఎస్‌హెచ్‌జీ మహిళల బృందం

తిరుపతి రూరల్: తమిళనాడు గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళలు శనివారం తిరుపతి జిల్లా వేమూరు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమిళనాడు బృందానికి ప్రకృతి వ్యవసాయ 9 సార్వత్రిక సూత్రాల గురించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి ఆదర్శ రైతు అయ్యప్ప నాయుడు వివరించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజర్ నాచురల్ ఫామింగ్ ఎస్‌హెచ్‌జీ మహిళలతో ఏ విధంగా ముందుకు వెళ్తోంది ? మహిళల పాత్రపై విశదీకరించారు. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల పంటలు వేసుకుని నెలకు రూ.10 వేలు ఆదాయం వచ్చేవిధంగా రూపొందించిన ఏటీఎం మోడల్ గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీయం షణ్ముగం, రైతులు పాల్గొన్నారు.

రోగి అదృశ్యం కావడంతో..

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీ పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదృశ్యమైన రోగి కోసం మూడు టీం లను ఏర్పాటు చేశారు. రామసముద్రం మండలం బురవమాకుల పల్లెకు చెందిన సీతారామప్ప గత నెల 28వ తేదీ తెల్లవారుజామున శ్రీ పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల నిరసన, ఆందోళనతో సీతారామప్పను వెతికి పట్టుకునేందుకు అధికారులు శనివారం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. మూడు బృందాలుగా ఏర్పడి వేర్వేరు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. సీతారామప్పకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారితో పోలీసులు ఒక్కో టీంగా ఏర్పడి వెతుకుతున్నారు. స్విమ్స్ నుంచి వాహనాలు, సెక్యూరిటీ సమకూర్చారు.

అభిమానికి చేయూత



కృష్ణారెడ్డికి నగదు అందజేస్తున్న కృష్ణ అభిమానులు

తిరుపతి మంగళం : దివంగత హీరో సూపర్‌స్టార్ కృష్ణ అభిమానికి కృష్ణ అండ్ మహేష్‌బాబు ఆల్‌ఇండియా ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. సూపర్‌స్టార్ హేష్‌బాబు గౌతమ్‌కృష్ణ పుట్టినరోజు సందర్భంగా శనివారం కృష్ణ, మహేష్ అభిమాని కృష్ణారెడ్డికి రూ.21,116 అందించారు. కృష్ణారెడ్డి ఇటీవల పక్షవాతంతో అనారోగ్యం బారిన పడ్డారు. విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా కృష్ణ అభిమానులు అభిమానికి నగదు అందించి, గౌతమ్‌కృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జనసేన, టీడీపీ నేతలను అరెస్టు చేయాలి



టీడీపీ, జనసేన నేతల రౌడీయిజాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేపడుతున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడ బాబు జగ్జీవన్ రామ్ పార్కు ముందు రాత్రికి రాత్రి బంకులు తెచ్చిపెట్టి వీధి వ్యాపారులపై రౌడీయిజం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్న టీడీపీ, జనసేన రౌడీలను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. వీధి వ్యాపారులపై రౌడీయిజం చేసిన జనసేన, టీడీపీ నేతల తీరును వ్యతిరేకిస్తూ శనివారం సాయంత్రం బాబు జగ్జీవన్‌రామ్ పార్క్ వద్ద సీపీఐ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10, 15 ఏళ్లుగా పార్క్ వద్ద స్థానికంగా తోపుడుబండ్లపై వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులను టీడీపీ, జనసేన నాయకులు కేశవాయనగుంటకు చెందిన 30 మంది వీధి రౌడీలను తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, వీధి వ్యాపారుల సంఘం నేతలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా చవితి వేడుకలు



కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ శిరీష, కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్/తిరుపతి(అలిపిరి): తుడా మైదానంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో వినాయక చవితి ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా జరుపుకుందామని విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో ఆస్తుల వేలం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తిరుపతి జోనల్ ఇండియన్ బ్యాంకు మేనేజర్ సెల్వరాజ్

తిరుపతి(అలిపిరి): సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఇండియన్ బ్యాంకులో ఆస్తుల వేలాలు జరుగుతాయని.. వేలంలో ఆస్తులను దక్కించుకోవచ్చని ఇండియన్ బ్యాంకు తిరుపతి జోనల్ మేనేజర్ సెల్వరాజ్ తెలిపారు. శనివారం తిరుపతిలోని ఇండియన్ బ్యాంకు బ్రాంచ్‌లో ఇండియన్ బ్యాంకు తిరుపతి జోనల్ ఆఫీస్ పరిధిలోని అసెట్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో జరిగే ఆస్తుల వేలానికి సంబంధించి త్వరలో తెలియజేయడం జరుగుతుందన్నారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే ఆస్తుల వేలంలో భవనాలు, ఖాళీ స్థలాలు, ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీలు ఉంటాయని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9490690276, 91086 72605 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రమశిక్షణకు మారుపేరు సుధాకర్



సమాచారశాఖ రికార్డు అసిస్టెంట్ సుధాకర్‌ను సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

తిరుపతి అర్బన్: సమాచారశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య అన్నారు. శనివారం ఆయనను కలెక్టరేట్‌లోని వారి కార్యాలయంలో విభాగ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో సమాచారశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రికార్డులు చూపించాకే కట్టుకోండి



నిర్మాణాలను ఆపేయమంటున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం: మంగళం గ్రామం సమీపంలోని కాలువ పక్కన నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని రెవెన్యూ అధికారులు నిర్మాణదారులకు సూచించారు. కాలువ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని శనివారం అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి అందిన ఫిర్యాదు మేరకు భూమి రికార్డులను పరిశీలించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కాలువ పక్కన నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపి వేయించారు. అయితే గత పదిహేనేళ్లుగా తమ ఆధీనంలో ఆ భూమి ఉందని, అందుకు సంబంధించిన రికార్డులను ఇదివరకే గత తహసీల్దార్‌కు సమర్పించామని నిర్మాణదారులు చెప్పారు. అయితే ప్రస్తుతం అర్బన్ తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి వచ్చారని, ఆమెకు మీ రికార్డులు చూపించి ఆపై నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అంతవరకు నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలతో దళితుల అభ్యున్నతి

చంద్రగిరి: దళితుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభివృద్ధి వైపు పరుగులు తీయవచ్చని తహసీల్దార్ శివరామ సుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం 1989లో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర నాయక్, డీటీ అమృత ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.